ప్రజాశక్తి
సోమవారం 14, నవంబర్ 2022
5
అనంతపురం



నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వరద బాధిత కుటుంబాలకు రూ.2లక్షలు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం నగర 1, 2 కమిటీల కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదలతో వివిధ కాలనీల ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. ముఖ్యంగా ఇళ్లు, సామగ్రి కోల్పోయారన్నారు. ప్రాణనష్టం తప్ప అన్ని రకాల నష్టాలకు వరద బాధితులు గురయ్యారన్నారు. ప్రభుత్వాలు తక్షణమే వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే నడిమివంకలో పూడిక తీయడంతోపాటు ప్రహరీ నిర్మించాలన్నారు. ఆయా సమస్యలపై పభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రభుత్వ స్టేడియంలు ప్రయివేటుపరం చేయొద్దు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియంలను పే అండ్ ప్లై పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని విద్యార్థులు, యువకులు, క్రీడాభిమానులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జెవివి కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా కోశాధికారి నూరుల్లా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్టేడియంలను ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం అంటే పేద, మధ్య తరగతి విద్యార్థి, యువకులను క్రీడలకు దూరం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాల్సిందిపోయి ఉన్న అరకొర ఆట స్థలాలను కూడా ప్రయివేట్ పరం చేస్తే క్రీడాకారులు ఎలా క్రీడా పోటీలలో రాణిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో బ్యాడ్మింటన్, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఇండోర్ స్టేడియం గేమ్స్ అన్నీ కూడా లీజ్‌కి ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికే విద్య ప్రయివేటీకరణ వల్ల స్కూళ్లలో ఆటలకు ప్రాధాన్యత తగ్గిపోయి విద్యార్థులకు కేవలం చదువు తప్ప వేరే ధ్యాస లేకుండా చేస్తున్నారని తెలిపారు. కనీసం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కొద్ది మంది విద్యార్థులు, యువకులు ఆటల పోటీలలో రాణిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడడం అన్యాయంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఆపాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయి స్వామి, ఎహెచ్ఎస్ సోమర రాహుల్, టిఎన్ఎస్ఎఫ్ వెంకటప్ప, నిరుద్యోగ పోరాట సమితి నాయకులు రామన్న, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్‌బిఎన్' అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్ఎస్‌బిఎన్ కాలేజీలో జరిగిన స్కాలర్‌షిప్ అక్రమాలపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం తీవ్రమైన అంశంగా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరపాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడారు. విద్యార్థులకు చెందాల్సిన ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని ఇతర బ్యాంకు ఖాతాకు మళ్లించారని కేసు నమోదు అయ్యిందన్నారు. విద్యార్థులకు సంబంధించిన 43 లక్షలా 39 వేల 65 రూపాయలను పక్కదారి పట్టించారని న్యాయవాది విఠల్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించడం ఆ కాలేజీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చిందన్నారు. ఇదిలావుండగా న్యాయస్థానం ఆదేశం మేరకు శుక్రవారం టూ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ఈ కేసుల నమోదు ద్వారా ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలకు ఉన్న ప్రతిష్ట దెబ్బతింటోందన్నారు. ఆ కాలేజీ పూర్వ విద్యార్థులు స్పందించి కాలేజీని కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఈ కాలేజీని తమ సొంత ఆస్థిలాగా యాజమాన్యం భావిస్తున్నట్లు ఉందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేయడం ద్వారా కాలేజిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

మరో జాషువా.. కవి పాలా వెంకటసుబ్బయ్య

'వెంకటసుబ్బయ్య కవిత్వ సర్వస్వం' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం



వెంకటసుబ్బయ్య కవిత్వ సర్వస్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రాయలసీమలో పుట్టిన మరో జాషువా పాలా వెంకటసుబ్బయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ, పాలా వెంకటసుబ్బయ్య కుటుంబం నిర్వహించిన వెంకటసుబ్బయ్య కవిత్వ సర్వస్వం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలా వెంకటసుబ్బయ్య సాహిత్యం పాఠకుల్ని ప్రేమిస్తుందన్నారు. మంచి కథకుడిగా, కవి, రచయిత, విద్యావంతుడు, రాజకీయవేత్త, ఉత్తమ సాహిత్యపరుడిగా ఎంతో కీర్తిని ఘడించారన్నారు. ఆయన సాహిత్యం నేటి తరానికి ఎంతో అవసరమన్నారు. అంతేగాకుండా ఆయన సాహిత్యంపై పరిశోధనలు జరగాల్సిన అవసరం కూడా ఉందన్నారు. కవి శాంతి నారాయణ, పద్య కవి ఏలూరు యంగన్న, అరసం జిల్లా అధ్యక్షుడు బి.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్ణ భేదాలను అధిగమించిన మధురకవి పాల వెంకటసుబ్బయ్య అన్నారు. సభా ప్రస్తావన చేసిన డాక్టర్ పాల విజయలక్ష్మీదేవి మాట్లాడుతూ తన తండ్రి రాజకీయ జీవితంలో ఉన్నా సాహిత్యాన్ని కుటుంబాన్ని ప్రేమించిన వ్యక్తి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ కావ్యాన్ని పరిచయం చేసిన యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు మూల మల్లికార్జునరెడ్డి, కె.నాగేశ్వరాచారి భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఈ కావ్యంలోని 27 అంశాలను సంపూర్ణంగా విశ్లేషించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల వెంకటసుబ్బయ్య గారి కుమార్తె పాల ఇందిర, అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, ఆర్.శశికళ, చిలుకూరు దీవెన, జి.అశ్వర్థరెడ్డి, కొత్తపల్లి సురేష్, టీవీ రెడ్డి, యాములపల్లి నర్సిరెడ్డి, మిద్దె మురళీకృష్ణ, కంబదూరు షేక్ నబిరసూల్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఓబులపతి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపాలి : మాజీమంత్రి కాలవ



శ్మశానంలో ఉన్న ఇసుకను తరలించిన దృశ్యాలను చూపుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాళ్ వేదవతి నది నుంచి వైసిపి నాయకులు ఇసుక అక్రమ రవాణాను ఆపాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉద్దేహాలు గ్రామంలో ఇసుక తరలించిన గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగదహాల్, ఉద్దేహాల్, బల్లలగుడ్డం, కళ్లుహోళ, గోవిందవాడ, సిద్ధరాంపురం, అరేసముద్రం, శ్రీరంగాపురం, గౌనూరు, సింగేపల్లి గ్రామాల నుంచి కొంతమంది అధికార పార్టీ నాయకులు ఇసుకను తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఆఖరికి శ్మశానాలను కూడా వదలడం లేదన్నారు. ఇసుక తరలింపును అడ్డుకోవడంలో సబ్ అధికారులు కూడా విఫలమయ్యారన్నారు. పోలీసులు కాపు రామచంద్రారెడ్డి కనుసన్నుల్లో నడుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, కేశప్ప, నాగరాజు, రామదాసు, హనుమంతురెడ్డి, పెద్ద రామన్న, కించప్ప, తిప్పేస్వామి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల నీడలో..సరస్వతి నిలయాలు

మనిషికి పుస్తకాలతో విడదీయరాని అభినాభావ సంబంధం ఉంది. సమాచార సాంకేతిక విప్లవం రోజు రోజుకూ కొత్తపుంతలు తొక్కుతూ రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్ వంటి ఆధునిక సమాచార సాధనాలు ఎన్ని వచ్చినా పుస్తకాలకు ప్రాధాన్యత ఎప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం. మనకు తెలియని ఎన్నో విషయాలను పుస్తక పఠనం ద్వారా తెలుసుకోవచ్చు. అలాంటి పుస్తకాల నియలయాలే గ్రంథాలయాలు. నేడు మారుమూల పల్లెల్లో కూడా గ్రంథాలయాల సాహితీ సౌరభాలు గుబాలిస్తూనే ఉన్నాయి. ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అధికారులు విద్యార్థులు, యువత మేధో వికాశానికి విశేష కృషి చేస్తున్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ఆటలు, పాటల పోటీలు నిర్వహిస్తూ విశేషంగా ఆకట్టుకుంటున్నారు. వారి దృష్టిని గ్రంథాలయాల వైపునకు మరల్చున్నారు. అయితే వైజ్ఞానిక కేంద్రాలుగా వెలుగొందాల్సిన గ్రంథాలయాలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

గంథాలయాల్లో కానరాని సౌకర్యాలు
ఇరుకు గదుల్లో పాఠకుల ఇక్కట్లు
కంప్యూటర్లు లేవు..కొత్త పుస్తకాలూ రావు..
నేటి నుంచి గ్రంథాలయాల వారోత్సవాలు





గుత్తి పట్టణంలో ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్న గ్రంథాలయం... పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో 69 ప్రభుత్వ శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఒక జిల్లా గ్రంథాలయం, 9 గ్రామీణ గ్రంథాలయాలు, 66 పుస్తక నిక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. 18 గ్రంథాలయాలు అద్దె, ఉచిత భవనాల్లోనే నిర్వహణ కొనసాగుతోంది. సొంత భవనాలున్న గ్రంథాలయాల్లో కూడా ఇరుకు గదులు ఉండడంతో గ్రంథాలయాల కొచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 12 గ్రంథాలయాలకు లైబ్రేరియన్లు లేరు. వీటిలో అత్యధికంగా రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లతోనే నడుస్తున్నాయి. 14 ఏళ్ళుగా అనేకమంది లైబ్రేరియన్లు ఉద్యోగ విరమణ చేయడంతో వాటిని ప్రభుత్వం భర్తీ చేయలేదు. దీంతో రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు అన్ని పనులూ చూసుకుంటున్నారు. లైబ్రరీల నిర్వహణలో లైబ్రేరియన్ల విధి ఎంతో కీలకం. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను భద్రంగా చూడటంతో పాటు వాటిని క్రమ పద్ధతిలో ఉంచి కావాల్సిన పుస్తకాలను క్షణాల్లో తీసుకునేలా ఏర్పాటు చేస్తారు. తరగతుల వారీగా పుస్తకాలను సెల్ఫుల్లో ఉంచుతారు. చందాదారులకు కావాల్సిన పుస్తకాలను డెలివరీ చేయడంతో పాటు గ్రంథాలయానికి సంబంధించిన అన్ని రికార్డులు నిర్వహిస్తుంటారు. ఇంత కీలకమైన లైబ్రేరియన్లు లేకుండా ప్రస్తుతం గ్రంథాలయాలు నడుస్తుండడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని పాఠకులు కోరుతున్నారు. గ్రంథాలయాల సమయాల్లో కూడా మార్పులు చేసి సమయాన్ని పెంచాలని పలువురు పేర్కొంటున్నారు.

నిధులు లేక కుంటుబడుతున్న అభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో ఏటా లక్షలాదిమంది పాఠకులకు, వేలాదిమంది చిన్నారులు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు ఇప్పుడు సమస్యల చెదలో సతమతమవుతున్నాయి. ఎంతోకాలంగా నిధులు లేక అభివృద్ధి కుంటుపడిపోయి అవస్థలతో అల్లాడుతున్నాయి. పంచాయతీల నుంచి, మునిసిపాలిటీల నుంచి, నగరపాలక సంస్థ నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు ఏళ్ల తరబడి రాకపోవడంతో గ్రంథాలయాల మనుగడ నానాటికీ దుర్భరంగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులైనా గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తే తప్ప.. గ్రంథాలయాలకు మోక్షం ఉండదు.

కంప్యూటర్లు లేవు..కొత్త పుస్తకాలూ లేవు..

జిల్లాలో చాలా గ్రంథాలయాలు గతంలో నిత్యం పాఠకులతో కిక్కిరిసి ఉండేవి. యువకులు, విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఇక్కడికొచ్చి పుస్తకాలు చదువుకునేవారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ బుక్స్ కూడా లభ్యమవుతుండడంతో విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలోనే వచ్చేవారు. అయితే, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఈ గ్రంథాలయాలు కూడా నిధులు లేక నీరసపడిపోయాయి.

శబ్ద కాలుష్యంతో చదవలేని పరిస్థితి..

గ్రంథాలయం అనగానే పిన్ డ్రాప్ సైలెన్స్ అనేది గుర్తుకు వస్తుంది. ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచేవిధంగా గ్రంథాలయం ఉండాలి. జిల్లా, పట్టణ లైబ్రరీల్లో అవేవీ కానరావడం లేదు. కారణం ప్రధాన రహదారులకు అవి పక్కనే ఉండడం, వాహనాల రణగొణ శబ్దాల మధ్య గ్రంథాలయంలో చదవడం అనేది గగనంగా మారింది. ఉదయం సాయంత్రం వేళల్లో శబ్ద కాలుష్యం మరీ ఎక్కువగా ఉంటుంది. శబ్దాలని భరించలేక విద్యార్థులు చాలా సందర్భాలలో గ్రంథాలయ తలుపులు మూసి లోపల చదువుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

చెదలు పడుతున్న పుస్తకాలు

మరోవైపు జిల్లాలోని అనేక గ్రంథాలయాల్లో క్రమేణా పుస్తకాలు చెదలు పడుతున్నాయి. పుస్తకాలను భద్రపరిచేందుకు తగు సామగ్రి కానీ, గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్ల వ్యవస్థ కానీ అందుబాటులో లేవు. గ్రంథాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రతిపాదనలున్నాయి. కానీ అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఒక్కో లైబ్రరీకి కనీసం రెండు కంప్యూటర్లన్నా అవసరం. కానీ..పట్టించుకునే వారెవరు?.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఈ దుస్థితులను గమనించి సెస్సు బకాయిలు ఇప్పించి జిల్లాలో గ్రంథాలయాలకు పునరుజ్జీవం ప్రసాదించాలని పాఠకలోకం ప్రార్థిస్తోంది.

వారోత్సవాలను జయప్రదం చేస్తాం

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి ఏడు రోజులు పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. 14వ తేదీన ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం. 15వ తేదీన మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయాల ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు. 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు. 19న దిశా చట్టం మహిళా సాధికారతపై చర్చ. 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, ముగింపు వేడుకలు నిర్వహిస్తాం.

- రామాంజనేయులు, శాఖ గ్రంథాలయాధికారి

సుందర 'అనంత'గా తీర్చిదిద్దుతాం

అనంతపురం మేయరు వసీం సలీమ్





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరాన్ని అందమైన సుందర నగరంగా తీర్చిదిద్దుతామని అనంతపురం నగరపాలక సంస్థ మేయరు వసీం సలీమ్ పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు.

ప్ర : నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటీ ?

మేయరు : అనంతపురం నగరంలో ప్రధాన రహదారులైన గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ రోడ్డు పనులు పూర్తయ్యాయి. వాటిల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసియున్నాం. ఇక బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు రహదారి నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. ఇవి వచ్చే రెండు మూడు మాసాల్లోపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. వీటితో మరికొన్ని ప్రాంతాల్లోనూ రహదారి పనులు చేపట్టాం. ఇవి కాకుండా అర్బన్ హెల్త్ సెంటర్లు ఆరు నిర్మాణంలో ఉన్నాయి. దీంతోపాటు నగరంలో మూడు ప్రాంతాల్లో క్రికెట్ ఆటగాళ్లు నెట్ ప్రాక్టీసు చేసుకోవడానికి వీలుగా క్రికెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. రాజేంద్ర మున్సిపల్ పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం జరుగుతోంది.

ప్రశ్న : నగరంలో ఇటీవల వరదలు ముంచెత్తాయి. నడిమివంక నుంచి నీరు ఉప్పొంగి ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అటువంటివి పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు ?

మేయరు : గతంలో 40 సంవత్సరాల్లో ఎప్పుడూలేనంతగా వర్షాలొచ్చాయి. నగరం పై భాగం నుంచి నీరు ఒకేసారి రావడంతో నడిమివంక ఉప్పొంగి నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చేరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని నడిమివంకను మరింత పటిష్టం చేయడానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇప్పటికే సమస్యను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడానికి సుముఖత వ్యక్తం చేశారు. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశాలూ ఉన్నాయి.

ప్రశ్న : పారిశుధ్యం మెరుగునకు తీసుకుంటున్న చర్యలేమిటీ ?

మేయరు : పారిశుధ్యం మెరుగునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వీటితోపాటు బయో మైనింగు ద్వారా ఇప్పటి వరకు డంపింగు యార్డులో పేరుకుపోయిన చెత్త మొత్తాన్ని సెగ్రిగేట్ చేసి వేరే రూపంలో వినియోగించే పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ పనులు 70 శాతం పూర్తయ్యాయి. దీంతోపాటు నగరం నుంచి బయటకు వెళ్లే మురుగునీరంతా ఇప్పటి వరకు అలాగే వదిలేయడం జరుగుతోంది. ఇకపై అలా కాకుండా శుద్ధిచేసి వదిలేందుకు టెండర్లు పిలువడం జరిగింది. త్వరలోనే అది పూర్తవనుంది.

ప్రశ్న : స్మార్టు సిటీ కింద అనంతపురం నగరం ఉంది. దీని కింద ఏమైనా పనులు నడుస్తున్నాయా ?

మేయరు : అవును స్మార్టు సిటీ కింద పనులు కొన్ని మంజూరై ఉన్నాయి. అనంతపురం నగరంలోని జెఎన్‌టియు రోడ్డును స్మార్టు స్ట్రీట్‌గా గుర్తించాం. శ్మశానవాటిక నుంచి జెఎన్‌టియు వరకు ఉన్న 1.4 కిలోమీటర్ల మేర అన్ని హంగులతో చక్కటి రహదారి నిర్మాణం చేపడుతున్నాం.

ప్రశ్న : అభివృద్ధి, పాలకవర్గ సభ్యుల సహకారం ఏ విధంగా ఉంది ?

మేయరు : అందరి సహకారంతోనే అభివృద్ధి పనులు ఎక్కడా ఎటువంటి ఆటంకాల్లేకుండా ముందుకు సాగుతున్నాయి. ప్రధానంగా అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్యల సహకారం చాలా ఎక్కువగా ఉంది. వీరు నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే అంశాల్లో పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీంతో ఇంత తక్కువ సమయంలో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టగలిగాం.

దళితుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప



మహాసభలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, హక్కులు సాధించుకోవడానికి, సమస్యలు పరిష్కారానికి అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్‌నగర్‌లో కెవిపిఎస్ నగర 2వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో దళితులపై వివక్ష కొనసాగుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్న దళతుల పట్ల దాడులు, హింస, హత్యలు, వివక్ష కొనసాగడం దుర్మార్గంగా ఉందన్నారు. దళితుల సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వాలు విస్మరించాయని తెలిపారు. కార్పొరేషన్‌లు నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. జరుగుతున్న అన్యాయంపై మాట్లాడితే నిర్బంధాలు, అక్రమ అరెస్టులు దేశంలో, రాష్ట్రంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ కుల వివక్ష నిర్మూలనకు కెవిపిఎస్ చేస్తున్న పోరాటం ఆదర్శనీయమన్నారు. కెవిపిఎస్ చేసిన పోరాటాల ఫలితంగా అనేక సంక్షేమ ఫలాలు దళితులకు అందాయని తెలిపారు. ప్రభుత్వాలు ఒక్కొక్క సంక్షేమ పథకాలు కోతలు విధిస్తుండటం అన్యాయంగా ఉందన్నారు. హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు మునుపు కెవిపిఎస్ మాజీ జిల్లా కార్యదర్శి వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకురాలు అరుణమ్మ, వెంకటేష్, దేవరాజ్, వన్నూరు, ఆనంద్, రాజు, జీవరత్నం, లక్ష్మీదేవి, వెంకటేష్, అక్కులప్ప, డేవిడ్, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు, పుల్లన్న, ఆవాజ్ నగర కార్యదర్శి వలి, సిపిఎం నాయకులు రామిరెడ్డి, బాబు, మసూద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ నగర కమిటీలు ఎన్నిక

కెవిపిఎస్ నగర టౌన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అక్కులప్ప, వెంకటేష్, నగర రూరల్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా జీవరత్నం, రాజాతో పాటు కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య

న్యాయ విజ్ఞాన శిబిరం

రాయదుర్గం : రాయదుర్గంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఆదివారం మండల న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో సమితి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య పాల్గొని విద్యార్థులకు న్యాయవిజ్ఞానం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ ఎస్‌డిసి) ఆధ్వర్యంలో మొదటి విడతలో భాగంగా రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్స్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్పర్, అకౌంటింగ్ ఎగ్జిక్యూటివ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఇఎంసి ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాయదుర్గం : రాయదుర్గంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంతో పాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 16న వక్తృత్వ పోటీలు, 17న చిత్రలేఖనం 18న కవి సమ్మేళనం, 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సభ, బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.జయరాములు తెలిపారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజాభివృద్ధిలో అంతర్భాగమన్నారు. గ్రంథాలయాలను అన్ని తరగతుల వాళ్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచి ఆర్.ఓబులేసు, గ్రామ పెద్దలు బి.పెద్దనారాయణరెడ్డి, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డోనేకల్‌లో 'గడప గడపకూ'

ఉరవకొండ : విడపనకల్లు మండలం డోనేకల్ గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ బసన్న, జడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండల వైసిపి ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు, తప్పక పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

శింగనమల : లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న గార్లదిన్నె సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అదాలత్‌కు అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ హాజరవుతారని తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

గుత్తి : జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 11 మండలాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నారాయణస్వామి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బాలాజీ తెలిపారు. ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉన్న చైల్డ్ లైన్ (1098) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాలల హక్కుల పరిరక్షణపై సోమవారం నుంచి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, విడపనకల్లు, పామిడి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి మండలాల్లో వారం రోజులు పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ (1098) సభ్యులు అశ్విని, భాగ్యలక్ష్మి, లావణ్య, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

సదస్సును జయప్రదం చేయండి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

'రాయలసీమ సమగ్రాభివృద్ధి-అవకాశాలు-ఆటంకాలు-పరిష్కారాలు' అనే అంశాలపై ఈనెల 15న గుంతకల్లులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో రాయలసీమ జనాభా 30 శాతం, విస్తీర్ణంలో 40 శాతం సాగు భూమి ఉందన్నారు. పారిశ్రామికంగా చూసినా కనీసం 10వేల మందికి ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ లేదన్నారు. రాయలసీమ జిల్లాలలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెరైటీస్, ఇనుము, బంగారం, వజ్రాలు, సిమెంట్ గ్రేడ్, హైగ్రేడ్ సున్నపురాయి, ఆస్బెస్టాస్, చైనాల్లే, గ్రానైట్ మొదలైన ఖనిజ సంపదలతో పాటు అత్యంత విలువైన ఎర్రచందనం లభిస్తోందన్నారు. ఇన్ని వనరులున్నా ఈ ప్రాంతం శతాబ్దాలుగా వెనుకబడి ఉందన్నారు. ఈ సదస్సుకు కర్నూలు నుంచి గౌస్ దేశాయ్, నంద్యాల నుంచి రమేష్, కడప నుంచి చంద్రశేఖర్, అన్నమయ్య జిల్లా నుంచి శ్రీనివాసులు, సత్యసాయి నుంచి ఇంతియాజ్, అనంతపురం నుంచి రాంభూపాల్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఓబులు తదితర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పవర్ స్టార్ కాదు..ప్యాకేజీల స్టార్..

ఉనికి కోసమే పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం : ఎమ్మెల్యే వైవిఆర్

ప్రజాశక్తి-గుంతకల్లు



విలేకరులతో మాట్లాడుతన్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ పవర్ స్టార్ కాదని.. ప్యాకేజీ స్టార్ అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నవరత్నాలు పథకాల్లో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని సాహసం సిఎం జగన్ చేస్తూ రూ.లక్షల కోట్లు వెచ్చించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల ఇళ్లను ఒక యజ్ఞంగా నిర్మించి ఇచ్చేందుకు నిర్విరామంగా పని చేస్తుంటే జనసేన నాయకులు మాత్రం దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. ఇకపోతే నియోజకవర్గంలో కాషాయం ధరించిన టిడిపి నాయకుడు జీవానందరెడ్డి కుటిల రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. పామిడిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుని కుట్టు సెంటర్ ఏర్పాటు చేశాడన్నారు. అయితే అది దగ్ధమైతే దానికి వక్రభాష్యం చెబుతున్నాడని ధ్వజమెత్తారు. అది ఎలా కలిపోయిందో విచారణ చేసి నిజాలు నిగ్గు తేలుస్తామన్నారు. అంతేగాకుండా గతంలో పాలు అమ్ముకుని జీవించే జీవానందరెడ్డికి ఇప్పుడు రూ.కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పద్ధతులు మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎం.రామలింగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి మీనుగ రామయ్య

వికలాంగులకు రూ.7,500 పింఛన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-పుట్లూరు

వికలాంగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.7,500 పింఛన్ ఇవ్వాలని వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి మీనుగ.రామయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండలంలోని కడవకల్లు గ్రామం కాశినాయన ఆశ్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక మండల మెదటి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వికలాంగులకు రూ.7,500 పెన్షన్ ఇవ్వాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద ర్యాపులు ఏర్పాటు చేయాలని, వికలాంగుల కోసం 2016 చట్టం అమలు చేయాలని, విఐడి కార్డులు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, 3000 మందికి పెండింగ్‌లో ఉన్న మ్యారేజ్ ఇన్సెంటివ్స్ డబ్బులను విడుదల చేయాలని, నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలతోపాటు మోటార్ సైకిళు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి అందరం ఏకమై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా టి.పెద్దయ్య, గౌరవాధ్యక్షులుగా వి.టి.రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీదేవి, టి.వీరప్ప, కార్యదర్శిగా ఎం.రామగిరి, సహాయ కార్యదర్శులుగా పి.రామాంజి, కమిటీ సభ్యులుగా బాబాఫకర్దీన్, సావిత్రి, కుళ్లాయప్పను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి గుత్తా వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి అండగా ఉంటాం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి, శింగనమల టిడిపి ఇన్‌ఛార్జి శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడే వారికి తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, శింగనమల నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ భరోసా ఇచ్చారు. ఆదివారం మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో ఓ శుభ కార్యక్రమానికి హాజరైన వారు విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి తాము రెడీగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, గోపురాజుపల్లె రవికుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, చిన్నాగిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి



టిడిపి కార్యకర్త తిమ్మక్కకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయ-చౌదరి

తిమ్మక్క మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మున్సిపాలిటీ పరిధిలోని కూరాకులతోట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వెలుగు తిమ్మక్క (55) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. తిమ్మక్క శనివారం మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆమె స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.లింగమయ్య

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంతోపాటు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎపి రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు సి.లింగమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకుపైగా రజకులు ఉన్నారన్నారు. వీరు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు లేక ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకులపై అగ్రవర్ణాలు నిత్యం దాడులు, దౌర్జన్యాలు, సాంఘిక బహిష్కరణలకు గురవుతున్నారన్నారు. తరతరాలుగా రజకులను సమాజానికి దూరంగా ఉంచారని మండిపడ్డారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. ఆయా రాష్ట్రాల్లో రజకులు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు పొంది మెరుగైన జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా చూస్తూ పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే రాష్ట్రంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 21న నియోజకవర్గ కేంద్రంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున రజకులందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సి.నాగప్ప, మండలాధ్యక్షులు సి.నాగరంగయ్య, చిదంబరప్ప, నాగేశం, జయరాముడు, శీన, నారాయణస్వామి, హనుమంతు, వీరాంజి, వీరాంజనేయులు, వరదరాజులు, బాలు, గంపన్న, వెంకటేశులు, నారాయణప్ప, వెంకటరాముడు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.లింగమయ్య

అరకొర నిధులు..శుష్క వాగ్దానాలు

పేదల అస్తవ్యస్త జీవితాలు..- జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి- అనంతపురం

శుష్క వాగ్దానాలు, అరకొర నిధులతో పేదల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ అన్నారు. జగనన్న ఇల్లు - పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని చిన్మయినగర్ వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాలు, జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలల కిందట కొంత మెటీరియల్ ఇచ్చిందని, బేస్మెంట్ తర్వాత పురోగతి లేదని వివరించారు. నీటి వసతి కూడా లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇందుకు టిసి వరుణ్ స్పందిస్తూ జగనన్న కాలనీల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉందన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, నగర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రోగ్రాం కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలోని వెస్ట్ నరసాపురం పంచాయతీలో ఉన్న చిన్న జలాలపురం జగనన్న కాలనీలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం పర్యటించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి బొమ్మన పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ తోట ఓబులేసు, నాయకులు మధు, కుళ్లాయప్ప, రామ్మోహన్, నరేష్, పులి కుమార్, జనీతు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో మండలాధ్యక్షులు కాసంశెట్టి సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తిప్పయ్య, కృష్ణ, మనోజు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం జనసేన మండల కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని రాయంపల్లి రోడ్డు పక్కన జగనన్న కాలనీలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పిలుపుమేరకు జగనన్న కాలనీల్లో పర్యటించి సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శులు మణికుమార్, జయకుమార్, నాయకులు బోగేష్, ఓబులేసు, లక్ష్మణ్, దేవేంద్ర, అబ్దుల్, మల్లేష్‌గౌడ్, సురేష్, రమేష్, ప్రశాంత్, రామాంజి, మధు, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని బి.పప్పూరు గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో జనసేన పార్టీ నాయకులు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కాలనీలో ఎక్కడ చూసినా ముళ్ల పొందలు, మందుబాబులు తాగి పడేసిన గాజుపెంకులే దర్శనమిస్తున్నామని జనసేన నాయకులు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్ర, జిల్లా సంయుక్త కార్యదర్శి జయమ్మ, నార్పల మండల అధక్షుడు గంజికుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, వినోదం నారాయణస్వామి, పొన్నతోట రామయ్య, వినోదం కుళ్లాయప్ప, ప్రదీప్, గిరీష్, రాజు, చరణ్‌కుమార్, వలిగిరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, నాయకులు

నెలకొండలో వైద్యశిబిరం

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని నెలకొండ గ్రామంలో పీజేఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీజేఆర్ వ్యవస్థాపకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ అనేక జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 300 మంది పేదలకు వైద్యం అందించామన్నారు. వారిని పరీక్షించిన వైద్యులు ఎక్కువ మంది ఫ్లోరైడ్ నీరు తాగి కిడ్నీ వ్యాధి, ఎముకల రోగాలు తో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా అవసరాన్ని గుర్తించి ప్రతి గ్రామంలో శుద్ధి జల యంత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం కోరితే తమ సంస్థ తరపున ప్రతి గ్రామంలో నీటిశుద్ధి పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అయితే కొంతమంది తమ సంస్థ తరపున ప్రజాసేవా కార్యక్రమాలు చేసేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న తమకు రాజకీయ రంగు పులిమి ప్రజాసేవను అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నాగభూషణం, నెలగొండ మాజీ సర్పంచి బాబు, కాంట్రాక్టర్ విజయ్, లాయర్ రమేష్, పులిగుంటపల్లి మాజీ సర్పంచి మల్లికార్జున, మిడ్ పెన్నార్ కాలువ ఛైర్మన్ రామలింగారెడ్డి, క్యాంప్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్లు శైలజ, హుమేరా, లక్ష్మణ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న పిజెఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి

గుంతకల్లు జట్టుపై గుత్తి జట్టు జయభేరి

డబుల్ సెంచరీ చేసిన కెప్టెన్ ఎం.భువనేశ్వర్

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్‌లో ఉన్న రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన అండర్-15 అనంత ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో గుంతకల్లు రైల్వే జట్టుపై గుత్తి జట్టు విజయభేరి మోగించింది. గుత్తి జట్టు కెప్టెన్ ఎం.భువనేశ్వర్ డబుల్ సెంచరీ చేశాడు. అలాగే రోహిత్ ఆల్ రౌండ్ ప్రతిభ చూపాడు. జూనియర్ అండర్ 15 అనంత ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆర్డీటి, ఏడీసీఎ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. టాస్ గెలిచిన గుత్తి జట్టు మొదటిగా బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ ఎం.భువనేశ్వర్ 186 బంతులకు 202 పరుగులతో విజంభించాడు. వి.రోహిత్ 54 పరుగులతో రాణించాడు. గుత్తి జట్టు 50 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంతకల్లు రైల్వే జట్టు 28 ఓవర్లో 76 పరుగులకు ఆలౌట్ అయ్యి ఘోర పరాజయం చవి చూసింది. బౌలింగ్‌లో వి.రోహిత్ 5 వికెట్లతో గుంతకల్లు రైల్వే జట్టు దెబ్బతీశాడు. డబుల్ సెంచరీతో రాణించిన కెప్టెన్ ఎం.భువనేశ్వర్, ఆల్ రౌండ్ ప్రతిభ చూపిన వి.రోహిత్ ను ఆర్డీటి కోచ్ జోషితో పాటు సీనియర్ క్రికెటర్లు అభినందించారు.



డబుల్ సెంచరీ చేసిన ఎం.భువనేశ్వర్



5 వికెట్లు తీసిన వి.రోహిత్

ఉచిత కంటి వైద్యశిబిరం

కళ్యాణదుర్గం : నంద్యాల జిల్లా శాంతిరామయ్య మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 65 మంది వృద్ధులు పాల్గొనగా, 40 మందికి కంటి వైద్య పరీక్ష ఆపరేషన్ కోసం నంద్యాల శాంతి రామయ్య ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సురేష్‌బాబు, డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస పూజలు

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో వెలసిన రామప్పకొండ ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి దీపాలు వెలగించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

బుక్కరాయసముద్రం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ ఎంఆర్‌పిఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సామ్రాట్ కేబీ మధు మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ఎదురూరు మహేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బి.రామకృష్ణమాదిగ, కోశాధికారిగా సాయికుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.



నూతన కమిటీ సభ్యులతో ఎంఆర్‌పిఎస్ నాయకులు

పవన్‌ను ఇన్వర్టర్‌లా వాడుకుంటున్న చంద్రబాబు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను టిడిపి అధినేత చంద్రబాబు ఓ ఇన్వర్టర్‌లా వాడుకుంటున్నాడని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని 9, 10వ డివిజన్లలో కార్పొరేటర్లు వై.లక్ష్మీదేవి, ఎం.దేవితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. సాధారణంగా ఇంట్లో కరెంట్ పోతే ఇన్వర్టర్ అందుబాటులో ఉంచుకుంటామని, అదే తరహాలో పవన్‌కళ్యాణ్‌ను చంద్రబాబు వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కోసం పవన్ కళ్యాణ్ పని చేస్తుంటే.. పేదవాడి సంక్షేమం కోసం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఏ గడపను తాకినా ఈ మూడేళ్ల పాలనలో ఎంతో సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అన్ని సదుపాయాలతో జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. గతంలో ప్రభుత్వాలు ఇళ్ల నిర్మాణాలకు సబ్సిడీలు మాత్రమే ఇచ్చేవని, కానీ సీఎం జగన్ మాత్రమే స్థలాలు ఇచ్చి ఉచితంగా ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకున్నారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్ ఉండదని భావించి అడుగడుగునా సైంధవుల్లా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాళ్లకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 2, 8, 9, 10వ డివిజన్లలో మురికివాడలు అధికంగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో దశలవారీగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, తప్పకుండా వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి